క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న రూప్లానాయక్

ధర్మారం: ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని 275 మంది లబ్ధిదారులకు రూ.64లక్షల విలువైన చెక్కులను అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాణాపూర్ గ్రామస్తులు

పాలకుర్తి: మండలంలోని రాణాపూర్ గ్రామానికి చెందిన పలువురు మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. ఎన్టీపీసీ ప్లాంట్ విస్తరణలో భాగంగా తాము వ్యవసాయ భూములను కోల్పోయామని, ఎన్టీపీసీ నుంచి వెలువడుతున్న కాలుష్యం, బూడిద మూలంగా గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, భూములు కోల్పోయిన తమకు సంస్థలో ఉపాధి కల్పించాలని, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టే విధంగా సంస్థ యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా గ్రామశివారులోని ఈతవనం తొలగించడంతో గ్రామంలోని గౌడకులస్తులు ఉపాధి కోల్పోయారని, ఎన్టీపీసీ సంస్థ ద్వారా ఉపాధి కోల్పోతున్న గౌడ కుటుంబాలకు పరిహారం ఇప్పించాలని గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఉపసర్పంచ్ బాలగోని కుమార్ గౌడ్, తిరుపతి, శ్రీధర్, రాజయ్య, శ్రీనివాస్, నారాయణ, రాములు, నర్సయ్య, గోవర్ధన్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఆశ నోడల్ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన పెంచాలన్నారు. డెంగీ నియంత్రణలో ఆశావర్కర్ల పాత్ర కీలకమన్నారు. జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వాసుపత్రుల్లో టిఫా స్కానింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామ ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు మంగళవారం పుట్నూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. హాస్టల్‌లో ఉంటున్న పిల్లల్లో కొంతమందికి శరీరంపై దద్దుర్లు, కొంతమందికి జలుబు, దగ్గుతో ఇబ్బంది పడుతున్నారు. డాక్టర్ సాయిసూర్య పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, తడిబట్టలు ధరించొద్దని విద్యార్థులకు సూచించారు. హాస్టల్ వార్డెన్ సంపత్‌కుమార్, హెచ్‌ఎం.పురుషోత్తం, కార్యదర్శి సాయిచరణ్‌రెడ్డి, ఏఎన్‌ఎం సరిత పాల్గొన్నారు.

16న బంద్‌కు సహకరించండి

పెద్దపల్లిరూరల్: బంగ్లాదేశ్‌లోని హిందువులపై దాడులను నిరసిస్తూ 16న నిర్వహించనున్న పెద్దపల్లి బంద్‌ను విజయవంతం చేయాలని వ్యాపార, వాణిజ్య సంఘ నాయకులు కోరారు. ఈ వ్యవహారంపై ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిషోర్ శారదతో పాటు దీపారాం, లక్ష్మణ్, రాజగోపాల్, వరప్రసాద్, మస్రత్, సతీశ్, స్వతంత్రకుమార్ కోరారు.

వైద్య శిబిరాలు, ఇంటింటా ఫీవర్ సర్వే

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట, శివపల్లి గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు, ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. శివపల్లిలో మెడికల్ క్యాంపు, ఇంటింటి సర్వేలో 43మందిని పరీక్షించి మలేరియా, డెంగీ పరీక్షలు చేసి 9 మందికి వైరల్‌ఫీవర్ ఉన్నట్లుగా గుర్తించారు. ధూళికట్టలో 57మందికి డెంగీ, మలేరియా పరీక్షలు చేయగా 16మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, పాత వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ వినయ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజేందర్‌రాజు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమణి, ఏఎన్‌ఎంలు అమృత, శిరీష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రదానం చేయండి.. చూపును ప్రసాదించండి

- సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి
- నేత్రదానానికి ముందుకు వచ్చిన 30మంది సింగరేణి కార్మికులు



డోనర్ కార్డులు చూపుతున్న సింగరేణి కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతీ ఒక్కరు నేత్రదానం చేసి అంధులకు చూపును ప్రసాదించాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి కోరారు. అంతర్జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆర్జీ–2 ఏరియా ఎంవీటీసీ(గని శిక్షణ కేంద్రం)లో నూతన సింగరేణి కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని నేత్ర, శరీర అవయవ దానాలపై అవగాహన కల్పించారు. 30మంది సింగరేణి కార్మికులు నేత్రదానానికి ముందుకు రాగా వారికి శిక్షణ గని మేనేజర్ మురళి కృష్ణ డోనార్ కార్డులు అందించి అభినందించారు. ఎస్‌ఎంఎస్ ప్లాంట్ పీవో నూక రమేశ్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రండి

సుల్తానాబాద్: విద్యార్థుల తల్లిదండ్రులు అవయవ దానానికి ముందుకు వచ్చేలా చైతన్యవంతం చేయాలని లయన్స్ క్లబ్ జిల్లా చీఫ్ కో–ఆర్డినేటర్ వలస నీలయ్య కోరారు. ప్రపంచ అవయవ దానం దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 5లక్షల మంది ప్రమాదవశాత్తు అవయవాలు కోల్పోయి మరణిస్తున్నారని, ప్రతీ ఒక్కరు అవయవ దానంపై ఇతరులకు అవగాహన కల్పించి, మరణానంతరం మానవ దేహాన్ని లేదా అవయవాలను దానం చేయడానికి మనవంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా కో–ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ మాటేటి కృష్ణప్రియ పాల్గొన్నారు.

వారి నేత్రాలు సజీవం

రామగిరి: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన ఉగ్గె కొమురక్క(56) సోమవారం గుండెపోటుతో మరణించారు. కుమారుడు ఉగ్గె నవీన్, కూతుర్లు సువర్ణ, సుజాతలు ఆమె నేత్రాలను దానం చేసి మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలని నిర్ణయించారు. అలాగే కల్వచర్లకు చెందిన కూర సతీశ్(30)సోమవారం రాత్రి కరీంనగర్ అసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లిదండ్రులు కూర రుక్కమ్మ–లింగయ్య, అన్నయ్య కూర నాగరాజు నేత్రదానానికి ముందుకు వచ్చి ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ద్వారా సదాశయ ఫౌండేషన్ సభ్యులను సంప్రదించారు. సదాశయ పౌండేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లింగమూర్తి, నూక రమేశ్, వాసు ద్వారా టెక్నీషియన్ ఆరీఫ్ నేత్రాలను సేకరించి వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. నేత్ర దానానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ కలవేన శ్రీకాంత్, పుల్లెల కొమురయ్య, తోట శంకర్, రేండ్ల సతీశ్ అభినందించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా అని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం 148 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 17 కల్యాణలక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జెడ్పీ హైస్కూల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల కమ్యూనిటీ భవనానికి రూ..5లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వుల పత్రాన్ని సంఘం ప్రధాన కార్యదర్శి కోలేటి అశోక్‌కు అందించారు. పత్తిపాక రిజర్వాయర్ కోసం సర్వే పనులు జరుగుతున్నాయని, దీంతో ఎస్సారెస్పీ డి–86 కాల్వ చివరి రైతుల భూములకు సాగునీటి కొరత తీరనుందన్నారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, ఎంపీడీవో రామ్మోహనా చారి, ఎంపీవో గోవర్ధన్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఎలిగేడు: జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన శ్రావణ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.75వేల ఎల్‌వోసీని మంగళవారం మండలంలోని శివపల్లిలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆయన నివాసంలో అందజేశారు.

బీసీల ఐక్యతను చాటుదాం



సమావేశంలో మాజీ జెడ్పీచైర్మన్ పుట్ట మధు

పెద్దపల్లిరూరల్: బీసీ కులాలకు చెందిన వారంతా పార్టీలకతీతంగా ఏకం కావాలని జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ పిలుపునిచ్చారు. పెద్దపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కౌశికహరి, దాసరి ఉష తదితర బీసీ నాయకులతో కలిసి మాట్లాడారు. బీసీ కులాలకు చెందిన నాయకులంతా వివిధ పార్టీల్లో ఉంటున్నా.. పార్టీలకతీతంగా నోరు విప్పితేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 20న పెద్దపల్లిలో బీసీ సదస్సు ఏర్పాటు చేసి విజయవంతం చేద్దామని ప్రకటించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు గంటరాములు, చిలారపు పర్వతాలు, రఘువీర్‌సింగ్, సంపత్‌యాదవ్, ఉప్పు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని పలు ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని స్టేషన్‌రోడ్డులో గల ఆలయంలో అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ రామగుండం నియోజకవర్గం అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ ఆఫీస్ జంక్షన్ నుంచి రాజేశ్ టాకీస్ ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హన్మంతుగౌడ్, చెన్నూరి అసెంబ్లీ ప్రబారి క్యాతం వెంకటరమణ, నాయకులు కోమల మహేశ్, కొండపర్తి సంజీవ్, కొడూరి రమేశ్, జనగామ భూమయ్య, గోపగాని నవీన్‌గౌడ్, మిట్టపల్లి సతీశ్, బానాల స్వామి, మామిడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సమస్యలు నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తా'

సుల్తానాబాద్: రజకుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. పట్టణ రజక సంఘం నూతన పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన రాజేశంతో పాటు కార్యవర్గాన్ని మంగళవారం ఆమె సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు గాజుల రాజమల్లు, రజక సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మధురయ్య, ఆనంద్ ఉన్నారు.

మహనీయులకు నివాళి

జూలపల్లి: బీజేవైఎం ఆధ్వర్యంలో స్వామీ వివేకానందుని విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్, సీనియర్ నాయకులు కంకణాల జ్యోతిబసు, బీజేవైఎం మండల అధ్యక్షుడు మీస అభిషేక్, ఉపాధ్యక్షుడు సాయిల్ల రాజమల్లు, నాయకులు పొన్నం వెంకటేశ్‌గౌడ్, మోహన్‌రెడ్డి, కోడూరి రాజేశ్వర్, మారం ఐలయ్య, సురేశ్, మణి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోని సింగరేణి



శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న సునీల్‌రెడ్డి

రామగిరి: సింగరేణి సంస్థలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రమాదాలు జరిగినా పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి ఆరోపించారు. మండలంలోని పన్నూర్‌లో ఇటీవల ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–1 హెచ్‌డీ కంపెనీ బ్లాస్టింగ్‌లో గాయపడ్డ కాంట్రాక్టు కార్మికుడు ఆడెపు శ్రీకాంత్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. సింగరేణి కార్మికులకు ప్రమాదం జరిగితే సీఅండ్ఎండీ, డైరెక్టర్ పా వచ్చి పరామర్శిస్తారని, కాంట్రాక్టు కార్మికులకు ప్రమాదం జరిగితే సింగరేణి అధికారులు ఎందుకు రారని ప్రశ్నించారు. మెరుగైన వైద్యం అందించడంలో ఓబీ కంపెనీల నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఓబీ కంపెనీ నిర్లక్ష్య ధోరణిపై చర్యలు తీసుకోవడంలో యాజమాన్యం వెనుకడుగు వేస్తోందన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ముల్కూరి శ్రీనివాస్, సెంటనరీకాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● మృతుల కుటుంబాలకు పరామర్శ

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్ళపల్లిలో మంగళవారం అనారోగ్యంతో మృతిచెందిన బీసగోని సత్తయ్య అనే కేశోరాం కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబాన్ని కేశోరాం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశికహరి పరామర్శించారు. అదేవిధంగా కేశోరాం ఓరియాకాలనీలో నివాసముండే కార్మికుడు సనాతన్ గుండెపోటుతో మృతిచెందగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సనాతన్ మృతదేహానికి నివాళి అర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, నాయకులు పెరుమాండ్ల రమేశ్, కమలాకర్‌రెడ్డి, తిరుపతి, సాదిక్, పూసాల ప్రసాద్ ఉన్నారు.

నెలరోజుల వ్యవధిలో ఐదుగురు మృతి..

మండలంలోని ఈసాలతక్కళ్ళపల్లిలో నెలరోజుల వ్యవధిలో ఐదుగురు వ్యక్తులు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. సంగెం నగేష్, ఆరె శివ, బీసగోని సత్తయ్య, పోచవ్వ, దాడి శివ వివిధ కారణాలతో మరణించారు.

● ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

జ్యోతినగర్: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ పిలుపునిచ్చారు. 14న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా నిర్వహించనున్న జనజాగరణ జయప్రదం చేయాలని కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. యాకూబ్, రాఘవరెడ్డి, మల్లేశ్, కనకయ్య, హుస్సేన్‌రెడ్డి, సంపత్, నరేశ్, ధరణి రాజయ్య, శ్రీకాంత్, దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● 16న బంద్‌కు సహకరించాలి

సుల్తానాబాద్: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులకు నిరసనగా ఈనెల 16న నిర్వహించే బంద్‌కు వ్యాపారులు సహకరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజుయాదవ్ కోరారు. హిందూ దేవాలయాలు, హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా నిర్వహిస్తున్న బంద్‌కు ప్రజలు, వ్యాపారులు, విద్యాసంస్థలు వ్యాపార, వాణిజ్య సంస్థల యాజమాన్యం స్వచ్ఛందంగా పార్టీలకతీతంగా పాల్గొనాలని కోరారు.

● జనజాగరణ జయప్రదం చేయండి

సుల్తానాబాద్: ప్రతీ కార్మికుడు ఈనెల 14 అర్ధరాత్రి వరకు జరగనున్న జనజాగరణ సభలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాక మహేశ్ కోరారు. సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు.

● కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం కోరారు. యైటింక్లయిన్‌కాలనీలో మంగళవారం నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ కమాన్‌పూర్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హామీలతో పాటు రాష్ట్ర ప్రజలకు తెల్లరేషన్ కార్డులు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు.

● ఆయుష్ వైద్యశిబిరానికి స్పందన

ఓదెల: మండలంలోని పొత్కపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పొత్కపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని 150మంది వినియోగించుకున్నారు. పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ తిరుపతి, గ్రామపంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, ఆయుష్మాన్ ప్రోగ్రాం మేనేజర్ విద్యాసాగర్‌రావు, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ప్రభాకర్, ఫార్మాసిస్టు సుధాకర్ లక్ష్మణ్, ఎస్ఎన్‌వోలు రాజమల్లు, లచ్చయ్య పాల్గొన్నారు.

స్కావెంజర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లో అంతకుముందు స్కావెంజర్లుగా పనిచేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలల (పారిశుధ్య) కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి మాధవికి వినతిపత్రం అందజేశారు.

● ఫొటోగ్రాఫర్లకు సన్మానం

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ ముందస్తు వేడుకలు మంగళవారం స్థానిక కళ్యాణ్‌నగర్‌లోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో నిర్వహించారు. మగువ అధ్యక్షురాలు గాలి సునీత మూడు దశాబ్దాలుగా ఫొటోగ్రఫీ రంగంలో సేవలు అందిస్తున్న సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఎదులాపురం సుధీర్‌బాబు, దబ్బెట శంకర్‌ను సన్మానించారు.

● మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పలువురు అనారోగ్యానికి గురి కాగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. లింగాపూర్ మాజీ ఉప సర్పంచ్ నిమ్మరాజుల సాగర్‌కు శస్త్రచికిత్స కావడంతో యోగక్షేమాలు తెలుసుకున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో స్వర్గీయ దయా రాజారాం కుటుంబసభ్యులు, పట్టణంలోని వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● కస్తూర్బా బాలికలకు ప్లేట్లు పంపిణీ

ముత్తారం: ముత్తారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం బాలికలకు మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాధవ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేశారు.

● బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు ముద్దసాని పద్మాదేవి, అమ్మ ఆదర్శ చైర్మన్ అమ్ము లావణ్య, విద్యార్థులు సన్మానించారు.



గోదావరిఖని: కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామం ఆరెపల్లిలో విద్యుత్ 33కేవీ స్తంభాలు ఒకవైపు వంగి ప్రమాదకరంగా మారాయి. అలాగే మారేడుగొండలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన చోట వైర్లు కిందకు వేలాడుతున్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే సరిచేయాలి.

– పత్తి లక్ష్మారెడ్డి, రైతు, పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 98499 71500

సివిల్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఆర్జీ–3 సివిల్ కాంట్రాక్టర్లు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో సివిల్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సీఅండ్ఎండీ బలరాంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కలిసి సివిల్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టు కార్మికుడు విధుల్లోకి రాకపోతే విధించే పెనాల్టీని సంబంధిత కాంట్రాక్టర్ బిల్లు నుంచి రీకవరీ చేసే విధానం రద్దు చేయాలని, సివిల్ వర్క్స్‌కు సంబంధించిన ఎస్.ఆర్ విడుదల చేసి మూడేళ్లు అయిందని, పెరిగిన ముడి సరుకుల దృష్ట్యా ప్రతీ ఏటా ఎస్.ఆర్ విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు వారు తెలిపారు. సీఅండ్ఎండి సానుకూలంగా స్పందించి సివిల్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సివిల్ కాంట్రాక్టర్లు చెప్పారు. కార్యక్రమంలో సివిల్ కాంట్రాక్టర్లు వనం రాంచందర్‌రావు, టి.కృష్ణ, ఎరుకల ఓదెలు, నాడెం సమ్మయ్య, నాడెం శంకర్, కనుకుల శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 జీఎంగా పనిచేస్తూ పదోన్నతిపై కార్పొరేట్ సేఫ్టీ జీఎంగా బదిలీపై వెళ్లిన చింతల శ్రీనివాస్‌ను మంగళవారం జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సన్మానించారు. ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, అధికారులు బైద్యా, చిలుక శ్రీనివాస్, చంద్రశేఖర్, ఆంజనేయులు, సాయిప్రసాద్, ఆంజనేయప్రసాద్, కిరణ్‌కుమార్, ధనలక్ష్మిబాయి, వరప్రసాద్, ఎస్వీరావు పాల్గొన్నారు.

పర్సనల్ విభాగం ఆధ్వర్యంలో..

ఆర్జీ–1 జీఎంగా పనిచేసి పదోన్నతిపై కార్పొరేట్ సేఫ్టీ జీఎంగా బదిలీపై వెళ్లిన చింతల శ్రీనివాస్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పర్సనల్ విభాగం ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీనియర్ పర్సనల్ అధికారులు బంగారు సారంగపాణి, శ్రావణ్‌కుమార్, సీఎంవోఏఐ అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షులు పానుగోటి శ్రీనివాస్, చిలక శ్రీనివాస్, డాక్టర్ కిరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు ఆత్మీయ సన్మానం



సన్మానిస్తున్న ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న ఇ.లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ముప్పిడి రవీందర్ రెడ్డి బదిలీ అయ్యారు. ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు మంగళవారం జీఎం కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. లక్ష్మీనారాయణ ఆర్జీ–1 ఏరియాలోని ఎంవీటీసీకి, రవీందర్‌రెడ్డి ఆర్జీ–1 ఏరియాలో పర్సనల్ విభాగానికి బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారి సీ.హెచ్.వెంకటరమణ, అధికారులు కె.ఐలయ్య, కోల శ్రీనివాస్, గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..

రామగిరి: ఆర్జీ–3 సింగరేణి సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహించి ఆర్జీ–1 ఎంవీటీసీకి బదిలీపై వెళ్తున్న ఇ.లక్ష్మీనారాయణను మంగళవారం సెంటనరీకాలనీ ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. అనంతరం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు సన్మానించారు. పన్నూర్ మాజీ ఎంపటీసీ చిందం మహేశ్, నాయకులు పెరుమాండ్ల ప్రసాద్, కల్వల శంకర్, మట్ట రాజ్‌కుమార్, అజయ్, తాటి సతీశ్, రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–1 ఏరియా ఉత్తమ కార్మికులు వీరే

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని ఉత్తమ కార్మికుల జాబితాను మంగళవారం అధికారులు ప్రకటించారు. చిందం కొమురయ్య(సపోర్ట్‌మెన్), ఎడ్ల సుధాకర్(కోల్ కట్టర్), సాగర్ల రాజయ్య(ఎస్‌డీఎల్ ఆపరేటర్), బొల్లెం శ్రీనివాస్(కోల్‌కట్టర్), వెంకటేశ్వర్లు(ఈపీఆపరేటర్), కొంపల్లి లక్ష్మణ్(ఎలక్ట్రీషియన్), కొట్టె సుధాకర్(షటిల్‌కార్ ఆపరేటర్), మాటూరి రాజేశం(జనరల్‌మజ్దూర్), జానిమియా(హెల్పర్) ఎంపికయ్యారు. వీరిని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించనున్నారు. అలాగే అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జీడీకే–11గని రాంకార్ ఆపరేటర్ ఉడుత బుచ్చయ్యను ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపిక చేశారు. ఇతన్ని కొత్తగూడెంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఅండ్ఎండీ చేతుల మీదుగా సన్మానించనున్నారు.

ఆర్జీ–2 ఏరియాలో..

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలో పనిచేస్తున్న ఉత్తమ కార్మికుల పేర్లను యాజమాన్యం మంగళవారం ప్రకటించింది. ఏరియాలోని ఓసీపీ–3లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న అయిరెడ్డి సంపత్‌రెడ్డి, మెకానికల్ ఫోర్‌మెన్ జల్లి వెంకటేశ్, వకీల్‌పల్లి గనికి చెందిన ర్యామ్‌కార్ ఆపరేటర్ కూచిపూడి రాంబాబు, టిండాల్ సూపర్‌వైజర్ మేడగోని బుచ్చిరాజం, ఓసీపీ–3 సీహెచ్‌పీ కన్వేయర్ ఆపరేటర్ సంకె రాజయ్యలను ఎంపిక చేశారు. వీరిని ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జీఎం ఎల్వీ సూర్యనారాయణ చేతుల మీదుగా సన్మానించనున్నారు. ఏరియా నుంచి ఉత్తమ ఉద్యోగిగా ఓసీపీ–3 ఈపీ ఆపరేటర్ సల్ల భిక్షపతిని ఎంపిక చేశారు. కొత్తగూడెంలో జరిగే ప్రధాన వేడుకల్లో సీఅండ్ఎండీ చేతుల మీదుగా సన్మానించనున్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

ఓదెల: మండలంలోని బీమరిపల్లె గ్రామానికి చెందిన జింకిరి రమేశ్(35) అనే యువకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమేశ్‌ను హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.